

జిల్లాలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు


జిల్లాలోని ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్

మండలం	వెదర్ స్టేషన్	కనిష్టం	గరిష్టం
కోనరావుపేట	మర్తనపేట	23.5	42.8
చందుర్తి	మర్రిగడ్డ	23.9	42.0
సిరిసిల్ల	సిరిసిల్ల	26.2	41.8
వేములవాడ రూరల్	వట్టెంల	23.7	41.7
వీర్నపల్లి	వీర్నపల్లి	23.6	41.6
తంగళ్లపల్లి	నేరేళ్ల	24.1	41.5
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	24.5	41.3
ముస్తాబాద్	నామాపూర్	25.2	41.0
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	24.6	41.0
కోనరావుపేట	నిజామాబాద్	24.3	40.9
ముస్తాబాద్	అవునూర్	24.1	40.8
సిరిసిల్ల	పెద్దూర్	24.3	40.6
ఇల్లంతకుంట	కందికట్కూర్	24.6	40.5
రుద్రంగి	మానాల	26.7	40.4
గంభీరావుపేట	గంభీరావుపేట	25.1	40.0
బోయినపల్లి	బోయినపల్లి	23.5	39.8
గంభీరావుపేట	గజసింగవరం	23.5	39.8
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	25.4	39.7
వేములవాడ రూరల్	మల్లారం	24.1	39.3
రుద్రంగి	రుద్రంగి	23.4	38.9

- 21 కేంద్రాల ద్వారా ఉష్ణోగ్రత లెక్కింపు
- టీఎస్‌డీపీఎస్‌లో జిల్లా స్థాయి సగటు నమోదు
- నిప్పుల కుంపటిగా జిల్లా
- 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. నాలుగు రోజులుగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత 23.0, గరిష్ట ఉష్ణోగ్రత 42.8గా నమోదై సగటు ఉష్ణోగ్రతలు రాజన్న సిరిసిల్ల జిల్లా ఆరెంజ్ జోన్‌లో నిలిచింది. అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. జిల్లాలో ఉదయం తొమ్మిది దాటిందంటేనే ఎండ వేడికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాలు జన సంచారం లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వరుసగా మరో మూడు రోజులు కూడా ఉష్ణోగ్రత ఇలాగే ఉంటుందని బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ఎండ మండలానికో తీరు...

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ గరిష్ట ఉష్ణోగ్రత 42.8 దాటింది. మండలాలు, ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉంటాయి. ఎండను ఆటోమేటిక్ వేదర్ స్టేషనల్‌ల ద్వారా అధికార యంత్రాంగం లెక్కిస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 21 వేదర్ స్టేషన్‌లు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల పట్టణం, పెద్దూర్, కోనరావుపేటలో మర్తనపేట, చందుర్తిలో మర్రిగడ్డ, వేములవాడ రూరల్‌లో వట్టెంల, మల్లారం, వీర్నపల్లి మండంలో వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలంలో నేరేళ్ల ఇల్లంతకుంట మండలంలో కందికట్కూర్, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, ముస్తాబాద్ మండలం అవునూర్, నామాపూర్, వేములవాడ మండలంలో నాంపల్లి, కోనరావుపేట మండలంల నిజామాబాద్, రుంద్రంగి మండలంలో రుద్రంగి, మానాల, గంభీరావుపేట మండలంలో గజసింగవరం, గంభీరావుపేట, బోయినపల్లి మండలంలో బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆటోమేటిక్ వేదర్ స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ స్టేడ్ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సోసైటీ (టీఎస్‌డీపీఎస్) నిర్వహణలో జిల్లాల వారీగా సగటు ఉష్ణోగ్రతలు లెక్కిస్తుంది. ఉష్ణోగ్రతల్లో 45 డిగ్రీలు వస్తే హెచ్చరికిగా 40-45 డిగ్రీలు వస్తే అప్రమత్తం, 35- 40 జాగ్రత్త, 35 ఉంటే హెచ్చరికలేనిదానిగా గుర్తిస్తారు. ఉష్ణోగ్రత లెక్కలను బట్టి ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడం, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టడం చేస్తారు. ఆరెంజ్ అలర్ట్‌లో పేర్కొన్న జిల్లాలో పలు సూచనలు చేస్తుంటారు.

● నిర్మానుష్యంగా ప్రాంతాలు

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లా కేంద్రంలో ఎప్పుడూ రద్దీగా ఉండే పాతబస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, కూరగాయల మార్కెట్, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, వెంకంపేట ప్రాంతాలు మధ్యాహ్నం వేళల్లో నిర్మానుష్యంగా మారుతున్నాయి. బుధవారం 15 వేదర్ స్టేషన్‌లలో ఆరెంజ్ అలర్ట్‌గానే చూపించారు. కోనరావుపేట మండలం మర్తనపేట స్టేషన్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 23.5 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలు, అత్యధికంగా నమోదు కాగా రుద్రంగి వేదర్ స్టేషన్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 23.4, గరిష్ట ఉష్ణోగ్రత 38.9గా నమోదైంది. రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వైద్యులు ప్రజలు బయటకు వెళ్లే ముందు జాగ్రతలు పాటించాలని సూచిస్తున్నారు. తెలుపు రంగు పలుచటి వస్త్రాలు ధరించాలని, నెత్తిపైన టోపీ, లేదా రుమాలు చుట్టుకోవాలని ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ వంటివి తాగాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే చల్లటి ప్రాంతానికి తీసుకవెళ్లాలని తడిగుడ్డతో శరీరం అంతా తుడుస్తూ ఉండాలని, వైద్య సేవలు అం దించాలని సూచిస్తున్నారు. ఎండనుంచి ఇంటికి రాగానే నిమ్మరసం, కొబ్బరినీళ్ల, మంచినీళ్ల తాగాలని సూచిస్తున్నారు. చర్మం పొడిబారకుండా చూసుకోవాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా, శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలని, మాశ్చరయిజింగ్ క్రీములు వాడాలని సూచిస్తున్నారు.

స్టేషన్ల వారీగా ఉష్ణోగ్రతల నమోదు
- శ్రీనివాసచారి, సీపీవో రాజన్న సిరిసిల్ల



జిల్లాలో 21 వెదర్ స్టేషన్ల ద్వారా ఉష్ణోగ్రతలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. జిల్లా సగటు ఉష్ణోగ్రత మాత్రం రాష్ట్ర స్థాయిలో టీఎస్‌డీపీఎస్ గణిస్తుంది. వెదర్ స్టేషన్ల ద్వారా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు, హెచ్చు తగ్గులను టీఎస్‌డీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చు.

● వడదెబ్బపై ఆరోగ్య శాఖ ప్రచారం...


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రజల్లో అవగాహన కలిగిస్తూ ఎండదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేపట్టింది. మూడు రోజుల క్రితం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి ఖీమ్యానాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ఇంట్లో నుంచి బయటకు రావద్దని సూచించారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడా నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తులను ధరించాలని సూచించారు. బయటికి వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని ధరించాలని, ద్విచక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడు కోవచ్చన్నారు. చర్మంపై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం లాంటివి చర్మంపై వస్తున్న మార్పులను గమనించాలన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108కు ఫోన్ చేసి చికిత్స, అవసరమైన మందులు పొందాలని సూచించారు.

తాగునీటి సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, ఏప్రిల్ 3: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తాగునీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 9398684240కు కాల్ చేయాలని సూచించారు. వారు సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి


రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 3: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, వేములవాడ, సిరిసిల్ల సెగ్మెంట్‌లకు కేటాయించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కేంద్రఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్, సిరిసిల్ల ఏఆర్‌వో పి గౌతమి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా రాజేందర్‌రెడ్డి



ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: పార్లమెంటు ఎన్నికల సిరిసిల్ల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పాశం రాజేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి గతంలో మండలశాఖ అధ్యక్షుడిగా పనిచేయగా ప్రస్తుతం కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో భారీ మెజార్టీ రావడానికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, శ్రీధర్‌బాబు, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపా రు.

చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా సంగీతం



సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 3: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ మహేష్‌కుమార్ గౌడ్ తెలంగాణ అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను కో ఆర్డినేటర్లు గా ప్రకటించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ మాజీ అధ్యక్షుడు, టీపీసీసీ సభ్యు డు సంగీతం శ్రీనివాస్‌ను చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను విడదల చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి


పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న డీఈవో, ఉపాధ్యాయులు

వేములవాడ, ఏప్రిల్ 3: ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రుల ప్రయత్నించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల మండల పరిషత్ పాఠశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా వార్షికోత్సవ వేడుకలు, ఇతర పండుగ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ విద్యార్థులకు వాటి ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ విద్యా ప్రమాణాలు పెంపొందిస్తున్నామని అన్నారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం ఉమా బాలచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడుకు చెంతకు చేరిన వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3: మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌కు తప్పిపోయి ఈ నెల 2న ఆశ్ర యం పొందిన వృద్ధుడు మెడకోకుల నర్సయ్య బుధవారం తన కొడుకు చెంతకు చేరాడు. ఇల్లంతకుంట మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన నర్సయ్య తప్పిపోయి ఈ నెల 2న రాత్రి ఎల్లారెడ్డిపేటలోని బస్టాండు ప్రాంతంలో తచ్చాడుతున్నాడు. గమనించిన స్థానికులు వృద్ధుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో చేర్పించారు. విషయం తెలుసుకున్న వృద్ధుడి కొడుకు డే కేర్ సెంటర్‌కు చేరుకున్నాడు. తన తండ్రిని వెంట తీసుకెళ్లాడు. ఆశ్రయం కల్పించిన నిర్వాహకులు, కేంద్రంలో చేర్పించిన స్థానికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ రక్షణ కోసమే పోలీసులు

చందుర్తి, ఏప్రిల్ 3: సమాజ రక్షణ కోసమే పోలీసులు అని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో మీ కోసం పోలీస్ కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా ఉంటుందన్నారు. అక్రమ ఇసుక రవాణా, గుడుంబా, సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలు ప్రైవేటు ఆర్డర్లవైపు దృష్టి సారించాలి

- చేనేత జౌళీశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న చేనేత జౌళీశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 3: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు ప్రభుత్వ ఆర్డర్లకు బదులు ప్రైవేటు ఆర్డర్లను ఇప్పించడానికి చేనేత జౌళీశాఖ ప్రయత్నాలు చేస్తుందని యాజమానులు, ఆసాములు ప్రభుత్వ ఆర్డర్లను కాకుండా ప్రైవేటు ఆర్డర్లు తీసుకోని నాణ్యమైన వస్త్రాన్ని తయారీ చేసేందుకు ముందుకు రావాలని చేనేత జౌళీశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని షాదీఖానాలో బుధవారం చేనేత జౌళీశాఖ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని పత్తర్‌ఘట్టీ వ్యాపారులతో యాజమానులు, ఆసాములకు ప్రైవేటు ఆర్డర్లపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అయితే అనివార్య కారణాల వలన వ్యాపారులు రాకపోవడంతో చేనేత జౌళీశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని యాజమానులు, ఆసాముల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు మండల సత్యం మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ఉన్న కాటన్ వస్త్రాల తయారీ ఆర్డర్లను యాజమాన్యలతో మాట్లాడి ఇప్పించాలని కోరారు. ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిరిసిల్ల రవీందర్, మండల రాజు మాట్లాడుతూ సిరిసిల్లలో మూడు నెలల నుంచి ఎలాంటి ఉపాధి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ ఆర్డర్లతోపాటు జౌళీశాఖ ద్వారా ఆర్డర్లను ఇప్పిస్తే తప్పకుండా వాటని తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్లలో 25వేల మరమగ్గాలపై గత ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వం ఆర్డర్లను ఏడు సంవత్సరాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే అధికారంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు మిగితా ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నందున యాజమానులు, ఆసాములు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు మార్కెటింగ్ వైపు చూసి ఆర్డర్లను తీసుకొని వస్త్రాలను తయారు చేసుకోవాలన్నారు. ప్రైవేటు ఆర్డర్లను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు ఇప్పించేందుకు ఇటీవల చేనేత జౌళీశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి హైదరాబాద్‌లోని పత్తర్ ఘట్టీ, సికింద్రాబాద్‌లలో పలు వ్యాపారులతో సమావేశాలను ఏర్పాటు చేసి ఆర్డర్లను ఇప్పించేందుకు వారితో చర్చలు జరిపారని వివరించారు. వ్యాపారులు ఈ సమావేశానికి రావాల్సి ఉండగా రాలేదని త్వరలోనే మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆర్డర్లను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికైనా యజమానులు, ఆసాములు వారి పరిశ్రమలలో ఏ మేరకు నాణ్యత ప్రమాణాలతో వస్త్రాలను తయారు చేస్తామనే నివేధికను అందించి నిర్ణయానికి వస్తే ఆర్డర్లను ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనికి అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌ఫోర్‌మెంట్ డీడీ వెంటేష్, వరంగల్ ఆర్‌డీడీ అశోక్‌రావు,ఎడి సాగర్ యాజమానులు, అసాములు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై పటిష్ట నిఘా: ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 3: రౌడీషీటర్ల కదలికలపై పటిష్ట నిఘా ఉంచామని, వారు సన్మార్గంలో నడవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవా రం నేరప్రవృత్తిలో మార్పు తెచ్చేందుకు జిల్లాలోని రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రౌడీలుగా ఉండే కంటే మీ పిల్లలకు హీరోలుగా కనిపించాలని అయన అన్నారు. మీ కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారాలన్నారు. రౌడీషీటర్స్ ప్రవర్తనలో మార్పు రావడానికి ఒక అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ఏడాదిలో మార్పు వస్తే రౌడీషీట్స్ తొలగించేందుకు అవకాశం ఉందన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, చర్యలపై నిఘా పెంచామన్నారు. నేరప్రవృతిలో మార్పురాకపోతే చట్టపరంగా చర్యల తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రాచారి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● సైబర్ వారియర్లకు ఫోన్లు అందజేత..

సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్‌కార్డులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సైబర్ వారియర్‌లను నియమించామన్నారు. సైబర్ వారియర్‌లకు శిక్షణ ఇచ్చి వారికి ఒక ఫోన్, సిమ్‌కార్డులు అందజేశామన్నారు. సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930కి కాల్‌చేసి ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకే ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా సైబర్ వారియర్స్‌ను నియమించామన్నారు. సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసి బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో నియమించబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా సైబర్ వారియర్స్ నంబర్లు సిరిసిల్ల టౌన్ 8712657807, తంగళ్లపల్లి 8712657810, ఇల్లంతకుంట 8712657803, ముస్తాబాద్ 8712657806, ఎల్లారెడ్డిపేట 8712657809, గంభీరావుపేట 8712657804, వీర్నపల్లి 8712657811, వేములవాడటౌన్ 8712657808, వేములవాడ రూరల్ 8712657812, బోయిన్‌పల్లి 8712657801, చందుర్తి 8712657802, కోనరావుపేట 8712657805, రుద్రంగి 8712657813 నంబర్లలో సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

కోనరావుపేట, ఏప్రిల్ 3: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి శ్రీనివాస్ అన్నారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం కోనరావుపేట మండలం నిమ్మపల్లి అటవీ ప్రాంతంలో నీటి తొట్టిలను ఏర్పాటు చేసి టాంకర్ల ద్వారా బుధవారం నీళ్లు పోసి అనంతరం మాట్లాడారు. వేసవిలో అడవి జంతువులు నీటి కోసం వచ్చి మృత్యువాత పడుతున్నాయని అన్నారు. వాటిని కాపాడేందుకు నీటి తొట్టిలను ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నామని అన్నారు. అడవి జంతువులను వేటాడితే చర్యలు తప్పవని అన్నారు.


నిమ్మపల్లి అటవీ ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తున్న అటవీ శాఖ అధికారులు

లక్షా 2 వేల నగదు పట్టివేత



శాతవాహన యూనివర్శిటీ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్3: కరీంనగర్ శివారులోని విద్యానగర్ ప్రాంతం శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద పోలీసుల తనిఖీలలో లక్షా 2 వేల 400 రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల నియామవళి అమలులో భాగంగా బుధవారం రాత్రి రెండో టౌణా సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నగదు పట్టుబడింది. రేకుర్తిలోని విజయపురి కాలనీకి చెందిన కొండ మనోహర్ అనే వ్యక్తి వ్యాపారంలో భాగంగా స్థానికంగా కిరాణం షాపుల స్టాకు విక్రయానికి సంబంధించి ఆయా షాపుల యజమానుల నుంచి డబ్బులు తీసుకుని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపించనందున లక్షా 2వేల 400 రూపాయల నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి స్వాధీనం చేయనున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్ట్

ధర్మపురి, ఏప్రిల్ 3: ధర్మపురి మండలంలోని రాయపట్నం భారత్ పెట్రోల్ బంక్ వద్ద మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్ పాల్పడిన కేసులో సిలిగిరి సందీప్ (24), ముంజ రాజేందర్ (19), పోతు అక్షయ్‌కుమార్ (24), మాదస్తు అలేఖ్య (31) అనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు వెల్లడించారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నిందితులు ముఠాగా ఏర్పడి జల్సాలకు అలవాటు పడ్డారు. గత నెల 29న రాయపట్నం గ్రామంలో మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించారు. అక్కడి నుంచి తమ బైక్ పైన వెళ్లి చోరీ చేసిన బంగారాన్ని గత నెల 30న భీంగల్ గ్రామంలో విక్రయించేందుకు ప్రయత్నించారు. నిందితులు సిలిగిరి సందీప్, ముంజ రాజేందర్ కలిసి పోతు అక్షయ్‌కుమార్ అతని భార్య మాదస్తు అలేఖ్య సహాయంతో దొంగిలించిన పుస్తెల తాడును మంచిర్యాలలో విక్రయించేందుకు బయల్దేరారు. రాయపట్నం వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపైన ఉన్న నలుగురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో నిందితులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు మోటార్ బైక్‌లు, 23 గ్రాముల పుస్తెల తాడు, మూడు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

వరదకాలువలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

మల్యాల, ఏప్రిల్ 3: అనారోగ్యంతో బాధపడుచున్న ఓ మహిళ వరద కాలువలో దూకి ఆత్మహత్యయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి అనే మహిళ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మల్యాల వచ్చే మార్గంలో గల వరదకాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గమనించి 100కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్ పోలీసులు ప్రసాద్, నర్సింగరావు అక్కడకు చేరుకొని మహిళను సురక్షితంగా బయటకు తీశారు. నీళ్ల తక్కువ ఉండడంతో ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ మేరకు పోలీసులు ఆమే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం చేయూత వాహనం

గణేష్‌నగర్, ఏప్రిల్ 3: ఆపదలో ఉన్న వికలాంగులు, వయోవృద్ధులను ఆదుకునేందుకు ఉమ్మడి జిల్లాకు చేయూత వాహనం మంజూరైందని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులను ఆదుకునేందుకు ఈ వాహనాన్ని వారికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆపదలో సహాయం అవసరమైన వయోవృద్ధులు 14567 టోల్ ఫ్రీ నెంబరుకు, దివ్యాంగులు 155326 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. ఫోన్ కాల్ స్వీకరించిన ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి అవసరాన్ని బట్టి చేయూత వాహనం ద్వారా వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు చేరుకుంటారని తెలిపారు. వారికి అవసరమైన సహాయం అందిస్తారన్నారు. వారి పరిస్థితిని బట్టి చేయూత వాహనంలో వారిని ఆస్పత్రికి, కుటుంబ సభ్యుల వద్దకు తరలిస్తారని తెలిపారు. టోల్ ఫ్రీ నంబరు సేవలు, చేయూత సేవలను ఆపదలో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

దేశానికి ఆదర్శంగా కేడీసీసీ బ్యాంకు

● టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: సమష్టి కృషితోనే కేడీసీసీ బ్యాంకు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని టెస్కాబ్, కేడీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సహకార రంగంలో తెలంగాణ సహకార వ్యవస్థ దేశానికే రోల్‌మోడల్ అని అందులోనూ మన జిల్లా బ్యాంకు అన్ని రంగాల్లో కూడా ఆదర్శంగా ఉందన్నారు. ఇది పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యుల సమష్టి సహకారంతోనే సాధ్యమైందని టెస్కాబ్, కేడీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేడీసీసీబీ 100.10 కోట్ల రూపాయల లాభాలను గడించడంతో పాటు రుణాల వసూళ్లు, డిపాజిట్ల సేకరణలోనూ అగ్రగామిగా నిలువడంతో పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులందరినీ అభినందించారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీబీ సమావేశ మందిరంలో జిల్లాలోని కేడీసీసీబీ పాలకవర్గం, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, కార్యదర్శులు, ఇతర ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న కేడీసీసీ బ్యాంకును 2011 నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామన్నారు. ఇక అప్పటి నుంచి లాభాల్లోనే ఉండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సహకార సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి మనం అమలు చేస్తున్న డిజిటల్, గవర్నింగ్, సుపరిపాలన వంటి సేవలను అధ్యయనం చేస్తున్నారని అన్నారు. గంభీరావుపేట సొసైటీ, కేడీసీసీబీతోనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. పంట రుణాల మంజూరులో జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో బ్యాంకు కేడీసీసీబీయేనని అన్నారు. దేశంలోనే 28శాతం పంట రుణాలు



బ్యాంకు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

ఇస్తున్నది మనమేనని, మరెక్కడ కూడా 12శాతానికి మించి పంట రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. సన్న, చిన్నకారు రైతులే మన వద్ద రుణాలు తీసుకుంటారని, వారి పట్ల కఠినంగా వ్యవహరించకుండా వాణిజ్య, ఇతర రుణాలపై దృష్టిపెట్టాలని సూచించారు. బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు టీంవర్క్ బాగా ఉందని అన్నారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి బ్యాంకులో నిర్ణయాలు తీసుకుంటూ మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సీఈవో సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ డైరెక్టర్ పుచ్చిడి మోహన్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హన్మంతరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



శైలజ(ఫైల్)

తంగళ్లపల్లి, ఏప్రిల్ 3: ఆర్థిక ఇబ్బందులకు తోడు, తన పెళ్లి కుటుంబ సభ్యులకు భారమవుతుందని మనస్తాపం చెందిన యువతి అత్తరి శైలజ (19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తరి లక్ష్మి కూతురు శైలజ ఇంటర్మీడియట్ వరకు చదివి మధ్యలోనే ఆపేసింది. పది సంవత్సరాల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా తల్లి లక్ష్మి కూలి పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం శైలజకు నిశ్చితార్థం జరిగింది. పెళ్లి దగ్గర పడుతుండడం ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం ఉండడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 3: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 52మంది రైతులు 694క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఏడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. కనిష్ఠ ధర రూ.6,300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇరాక్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం



వెంకటేశం (ఫైల్)

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: ఉపాధి కోసం ఇరాక్ వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒగులాపూర్ గ్రామానికి చెందిన బైరి వెంకటేశం (40) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామంలో సరైన ఉపాధి లేకపోవడంతో వెంకటేశం ఎనిమిది సంవత్సరాల క్రితం ఇరాక్ వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబరు నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశం మృతి చెందాడు. మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబీకులు ప్రయత్నం చేయడంతో మూడు నెలలకు స్వగ్రామం చేరింది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబీకులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నకిలీ వీసా కేసులో కేరళ ఏజెంట్ అరెస్ట్

మెట్‌పల్లి, ఏప్రిల్ 3: మెట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురికి గల్ఫ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసిన కేరళ రాష్ట్రానికి చెందిన ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలు జిల్లాలకు చెందిన గల్ఫ్ బాధితులను దుబాయికి పంపిస్తామని ఐదుగు రు ఏజెంట్లుగా ఏర్పడ్డారు. వీరిలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన అల్లా రమేష్ అనే వ్యక్తి జిల్లాకు చెందిన 40 మంది గల్ఫ్ బాధితులను దుబాయికి పంపిస్తానని నమ్మబలికాడు. ఏజెంట్ జనవరిలో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 26,500ల చొప్పున మొత్తం సుమారు రూ. 10లక్ష లను వసూలు చేసి నకిలీ వీసాలు అందజేశాడు. వారు దుబాయి పోదామని ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా అక్కడి అధికారులు పరిశీలించి ఇవి నకిలీ వీసాలని పంపించేశారు. దీంతో వారు మోసపోయామని గుర్తించి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 48, 51, 52, 67 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి ఏ1గా ఉన్న అల్లా రమేష్‌ను ఫిబ్రవరిలో అదుపులోకి తీసుకొని విచారించగా ఇందులో మొత్తం ఐదుగురు ఉన్నట్లు తెలుపగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఏ2గా ఉన్న కేరళ రాష్ట్రానికి చెందిన మహ్మద్ హసీఫ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.



వివరాలు తెలుపుతున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి

హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 3: వరకట్న హత్య కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జ్ ఎన్ ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. చందుర్తి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన రేవతి అలియాస్ శిరీషకు 2017లో కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కంటె నరేష్ అనే వ్యక్తితో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ. 10.50 లక్షలతో పాటు 11 తులాల బంగారం, ఇతర లాంఛనాలు ఇచ్చి పెళ్లి చేశారని ఎస్పీ తెలిపారు. ఏడాదిలో కూతురు జన్మించింది. తర్వాత అదనపుకట్నం, రెండు తులాల బంగారం, గొర్రెలు, ఒక ప్లాట్ ఇవ్వాలని వేధింపులు గురి చేశారని తెలిపారు. వేధింపులకు భరించలేక 19 మార్చి 2021న శిరీష ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఆమె భర్త నరేష్, అత్త, మామ, ఆడబిడ్డను రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ చంద్రకాంత్ కోర్టులో చార్జిషీట్ వేయగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సిఎంఎస్ కానిస్టేబుల్స్ నరేందర్, లతీఫ్‌లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా స్పెషల్ పిపి నర్సింగరావు కేసు వాదించారని తెలిపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత నేరం రుజువు కావడంతో నిందితుడైన కంటె నరేష్‌కు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 30 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



సుధారాణి(ఫైల్)

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 3: వారిద్దరిది ప్రేమ పెళ్లి... వీరికి ఓ బాబు పుట్టాడు. బాబు పుట్టి వెంట్రుకల కార్యం చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. శుభకార్యానికి ఒక రోజు ముందే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన రంజిత్ ధర్మపురి మండలం తిమ్మాపూర్‌కు చెందిన సుధారాణిని ప్రేమించి 2020లో కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరు కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరికి హర్షవర్ధన్ అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుడి పుట్టివెంట్రుకల శుభకార్యాన్ని నిర్వహించేందుకు గురువారం ముహూర్తం నిర్ణయించుకున్నారు. అయితే బుధవారం ఉదయం సుధారాణి(26) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. సుధారాణి భర్త రంజిత్ పథకం ప్రకారం వేధింపులకు గురిచేసి హత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ మృతురాలి తల్లి వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాల డీఎస్పీతో పాటు సీఐ, ఎస్సైలు రంగంలోకి దిగి పూర్తి వివరాలు సేకరించారు. సుధారాణి మృతదేహాన్ని పరిశీలించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘన : రూ. లక్ష జరిమానా

కోనరావుపేట, ఏప్రిల్ 3: బైండోవర్ నిబంధన ఉల్లంఘించిన వ్యక్తికి లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన అలిపిరి ఆదిరెడ్డి గతంలో రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోనరావుపేట పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. లక్ష రూపాయల పూచికత్తు మీద వదిలిపెట్టారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఇటీవల పట్టుబడగా కేసు నమోదు చేశారు. బుధవారం లక్ష రూపాయలను ట్రెజరీలో జమచేయడం జరిగిందని అన్నారు. బైండోవర్ నిబంధనలను ఎవరూ ఉల్లంఘించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 210 గ్రాముల గంజాయి పట్టివేత ● ద్విచక్ర వాహనం స్వాధీనం

కోరుట్ల, ఏప్రిల్ 3: నిజామాబాద్ నుంచి కోరుట్లకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో వివరాలను ఎస్‌ఐలు కిరణ్‌కుమార్, శ్వేతలతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని హాజీపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి టీఎస్ 02 ఈడీ 0698 నంబర్ గల ద్విచక్ర వాహనంపై నిజామాబాదు నుంచి కోరుట్లకు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని వెటర్నరీ కళాశాల వద్ద మంగళవారం రాత్రి ఎస్ఐ శ్వేత వాహనాలు తనిఖీ చేస్తుండంగా మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వస్తున్న మహ్మద్ షబ్బీర్ నడిపిస్తున్న ద్విచక్ర వాహనంను తనిఖీ చేయగా వాహనంలో 210 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులగా మహ్మద్ షబ్బీర్ నిత్యం నిజామాబాదు నుంచి కోరుట్లకు గంజాయి తరలించి పట్టణంలో విక్రయించేవాడని తెలిపారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

మహ్మద్ షబ్బీర్‌తో పాటు అతని వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినుట్ల తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్వేత సిబ్బందిని అభినందించారు.

భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

భగత్‌నగర్, ఏప్రిల్ 3: శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తుల ఇంటికే భద్రాద్రి కల్యాణ తలంబ్రాలు అందించే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. బుధవారం కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఆధ్వర్యంలో తలంబ్రాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17న జరగబోయే శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ కల్యాణ తలంబ్రాలను టిఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా అందిస్తామన్నారు. 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 151 రూపాయలు చెల్లించి కల్యాణ తలంబ్రాలను బుక్ చేసుకోవాలన్నారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌తో పాటు, అన్ని కార్గో బుకింగ్ కౌంటర్లలో, మార్కెటింగ్ ఏజెంట్ల వద్ద కూడా బుకింగ్ సదుపాయం ఉందన్నారు. మరిన్ని వివరాలకు కరీంనగర్ జిల్లా లాజిస్టిక్స్ మేనేజర్ ఎస్ సదాశివ్ సెల్ నెంబర్ 8125459004 సంప్రదించాలన్నారు. తలంబ్రాలు బుక్ చేసుకొనుటకు రీజినల్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ రాజు 9154298581, కరీంనగర్ 9154298561, జగిత్యాల 9985222739, మెట్‌పల్లి 9154298574, హుజూరాబాద్ 9573851108,గోదావరిఖని 9154298554, కోరుట్ల 9963961503,సిరిసిల్ల 9154298576, హుస్నాబాద్ 9951819588 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

హోటళ్లు, బేకరీ, మెస్‌లపై విజిలెన్స్ దాడులు

● శాంపిళ్ల సేకరణ, జరిమానా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3 : కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి, విక్రయాలు జరుపుతున్నారనే ఫిర్యాదులపై కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు అధికారులు బుధవారం కరీంనగర్‌లోని పలు హోటళ్లు, బేకరీలు, మెస్, రెస్టారెంట్‌లపై దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కరీంనగర్ పలు హోటళ్లలో తణిఖీలు చేశారు. విజిలెన్స్ పోలీసులతో పాటు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ శానిటేషన్ అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా కిచెన్‌లలో ఆహార పదార్థాలను తనిఖీ చేసి, శాంపిళ్లను సేకరించారు. ఈ శాంపిళ్లను హైద రాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్)కు పంపించి, పరీక్షల నివేదిక వచ్చిన అనంతరం చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు, కరీంనగర్ ఇంచార్జి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుజాతలు మాట్లాడుతూ కల్తీ ఆహారపదార్థాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్‌లో పలు హోటళ్లు, రెస్టారెంట్, మెస్‌లలో వంట గదులను శుభ్రంగా ఉంచడం లేదని, ఆహార పదార్థాల నిలువచేయటం, నాణ్యతపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు నాణ్యతమైన, కల్తీలేని ఆహారపదార్థాలు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమించితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కొనసాగుతాయన్నారు. ఇప్పటికే తీసుకున్న శాంపిళ్ల రిపోర్ట్ వచ్చిన తరువాత కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామన్నారు. మైసూర్ బేకరీలో కిచెన్ అపరిశుభ్రంగా ఉందని తనిఖీలలో వెల్లడి కావటంతో మున్సిపల్ శానిటరీ అధికారులు మైసూర్ బేకరీ యజమానికి 2 వేల జరిమానా విధించారు. కిచెన్ శుభ్రంగా లేకుంటే కేసు నమోదు చేయటంతో పాటు, బేకరీని సీజ్ చేయనున్నట్లు యజమానికి నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వరుణ్, అనిల్, ప్రసద్, తహసీల్దార్ దినేష్ పాల్గొన్నారు.

పోలీసుల కస్టడీలో ప్రజాప్రతినిధుల భర్తలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే గాక, బాధితుని భూమి ఆక్రమణకు పాల్పడిన చింతకుంట మాజీ సర్పంచ్, కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి, ఒకే భూమిని పలువురికి విక్రయించి, ముందుగా కొనుగోలు చేసిన విక్రయదారులను మోసం చేసిన విషయంలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను పోలీసులు కస్టడీకి తీసుకుని విచా రిస్తున్నారు. భూకబ్జాల కేసుల్లో మార్చి 26న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో మరింత లోతుగా విచారించి, సమాచారాన్ని రాబట్టేందుకు పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయగా ఈ మేరకు పిట్టల రవీందర్‌ను 48 గంటల కస్టడీకి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు కోర్టు అనుమతించింది. అలాగే ఆకుల ప్రకాష్‌ను



ఆకుల ప్రకాష్‌ను కస్టడీకి తీసుకున్న పోలీసులు

కూడా బుధవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు 24 గంటల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇద్దరిని కస్టడీకి తీసుకుని



పిట్టల రవీందర్‌ను కస్టడికి తీసుకున్న పోలీసులు

విచారిస్తున్నారు. విచారణలో భాగంగా పిట్టల రవీందర్, ఆకుల ప్రకాశ్‌ల ఇళ్లల్లో బుధవారం సోదాలు జరిపారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రాచకొండ అశోక్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ ఇల్లంతకుంటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పండలాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీనితో గాయపడిన అశోక్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 3: మండలంలోని తారుపెల్లి గ్రామంలో బాసిరి మోహన్, అతడి సమీప బంధువైన శ్రీనివాస్‌ను వ్యక్తిగత కక్షలతో అదే గ్రామానికి చెందిన బాసిరి అంజయ్య, బాసిరి సంపత్, బాసిరి సురేష్‌లు వారి ఇంటికి వెళ్లి కొట్టి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన మోహన్, శ్రీనివాస్‌ను వైద్యం కోసం ఆసుపత్రికి తరలించి బాధితుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు బాసిరి అంజయ్య, బాసిరి సంపత్, బాసిరి సురేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆది శ్రీనివాస్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

చందుర్తి, ఏప్రిల్ 3: బీఆర్ఎస్ నాయకులు పది సంవత్సరాలు అధికారం అనుభవించి అధికారం కోల్పోగానే మతిభ్రమించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో కరువుకు మాజీ సీఎం కేసీఆర్ కారణమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం జోగాపూర్‌లో బుధవారం కృతజ్ఞత ర్యాలీలో పాల్గొని, ఛత్రపతి శివాజీ వర్ధంతి, దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో భాగంగా పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చిన తర్వాతనే కరువు వచ్చిందని కేసీఆర్, కేటీఆర్, హరీ‌ష్‌రావు అంటున్నారని, నిజంగా కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు వచ్చిందా ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. ఏ కాలంలో కూడా వర్షాలు వస్తాయో తండ్రీ కొడుకులకు, బావబావమ్మర్దులకు అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల ఓడిపోయినా ఇంకా పొగరు మాటలు తగ్గడం లేదన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే పదవిని కేవలం వారి హోదాకు చిహ్నంగా వాడుకున్నారే తప్ప మన ప్రాంతం అభివృద్ధికి, ప్రజాసేవ కోసం కాదన్నారు. చందుర్తి మండలాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జోగాపూర్‌లోని గురునాథం చెరువు, ఆశిరెడ్డిపల్లి పరిధిలోని కొత్త చెరువు, సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువు, కలికోట సూరమ్మ చెరువు నిర్మాణం పట్టించుకోలేదన్నారు. ఆనాడు చేసిన పనులకు కాంట్రాక్టర్లుకు బిల్లులను కూడా సరిగా చెల్లించలేదని, మేము వచ్చాక చెల్లిచమని అన్నారు. జోగాపూర్‌లో వర్షాకాలంలో ప్రజలు కాల్వర్టు దాటేందుకు ఇబ్బంది లేకుండా హైలెవల్ వంతెనల నిర్మాణం చేపడతామ న్నారు. త్వరలోనే చందుర్తి మండల పరిధిలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. రైతు భరోసాపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేసున్నయన్నారు. ఇప్పటివరకు ఐదెకరాలలోపు రైతులకు భరోసా ఇచ్చామ న్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామని కేటీఆర్, హరీ‌ష్‌రావు, కేసీఆర్ అంటున్నారని, పది సంవత్సరాలు అధికారం అనుభవించి నేడు అధికారం కోల్పోగానే మతిభ్రమించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నార న్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి అన్నారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు అమర బండ శ్రావణ్‌కుమార్, నాగం రాజ మల్లయ్య, గంట మల్లేశం, ధర్మపురి శ్రీనివాస్, మునుకు పద్మ, బీమారాజు కనకరాజు, గొట్టె ప్రభాకర్, బొజ్జ మల్లేశం, వేల్పుల దేవస్వామి, మునుకు ముకుందరెడ్డి, మ్యాకల పరశురాములు, నాగం గణేష్, మనోహర్, దూది శ్రీనివాస్ రెడ్డి, నాగం శ్రీనివాస్, అమర బండ సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రుద్రవరం నాయకులు


ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 3: అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతు న్నాయి. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామ మాజీ సర్పంచ్ ఊరడి రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ వంకాయల భూమయ్యతో పాటు సుమారు 50 బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బుధవారం వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం ఆది శ్రీనివాస్ తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆక ర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేద, బడుగు, బలహీన వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. రాను న్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలు పునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు పిల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 3 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీతోపాటు క్వింటాల్ ధాన్యానికి రూ 500 బోనస్‌లను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి, గంభీరావుపేట, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండల్లాలో అత్యధికంగా వడగళ్ల వర్షం పడడంతో వందలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. వడగళ్ల వర్షానికి దెబ్బతిన పంటలకు ఎకరానికి రూ 10వేలు ప్రకటించినా ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించడంతోపాటు రైతులకు రెండు లక్షల రుణమాఫీని అమలు చేయడంతోపాటు ధాన్యం క్వింటాళ్లకు రూ 500 బోనస్‌లను అందిం చాలన్నారు. కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్ మాట్లాడు తూ రైతన్నలతోపాటు సిరిసిల్లలో నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల న్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కౌన్సిలర్ గుడూరి భాస్కర్, మండలాల అధ్యక్షులు పోన్నాల తిరుపతిరెడ్డి, గంట అశోక్, మోర శ్రీహరి, కోడం శ్రీనివాస్, చొప్పదండి శ్రీనివా స్, అంకారపు రాజు, తవుటు రాజలింగం, సందవేని రాజు, అసాని రాంలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ-పెద్దిరాజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 3: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ శివారు లోని జగ్గారావుపల్లెలో పెద్దమ్మ-పెద్దిరాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభించారు. జగ్గారావుపల్లె ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను జోషి విద్యాసాగర్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, అఖండ దీపారాధన, గణపతిపూజ, యాగశాల ప్రవేశాలు చేపట్టి విగ్రహాలను డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. గురు వారం మండపారాధన, హోమాలు జరుగుతాయి. శుక్రవారం ఉదయం 6.35 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రామచంద్రం, ఉపాధ్యక్షుడు పర్శరాములు, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి రాములు, కార్యదర్శి లక్ష్మణ్, కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేతన్న గర్జన సభ విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 3: ఈ నెల 6వ తేదీన సిరిసిల్లలో తలపెట్టిన నేత న్న గర్జన సభను విజయవంతం చేయాలని ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో బుధవారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురువారం సిరిసిల్లలో నేతన్న గర్జన సభ విజయవంతం కోసం ప్రచార పాదయాత్ర చేస్తామని తెలిపారు. గత మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమలో నెల కొన్న సంక్షోభం వలన కార్మికులు ఉపాధి ని కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిరిసిల్ల నేతన్నల అకలికేకలను రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించేందు కు 6న సిరిసిల్లలో నేతన్నల గర్జన సభను ఏర్పాటుచేశామన్నారు. ఈ సభను విజయవంతం చేయడం కోసం సిరిసిల్లలో గురువారం నేతన్న చౌక్‌నుంచి ప్రచార పాదయాత్ర కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపపడతామన్నారు. అన్ని రంగాల కార్మికులు, యాజమానులు, ఆసాములు పాల్గొనాలని కోరా రు. సమావేశంలో ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మండల సత్యం, మూషం రమేష్, పంతం రవి, సిరిసిల్ల రవీందర్, ఎల్లండి దేవదాస్, తాటిపాముల దామోదర్, కట్టికోల లక్ష్మీనారాయణ, పిస్కమధు, గౌడరాజు, కో దం రమణ, వేముల దామోదర్, బోడ్డు శ్రీధర్, సిరిమల్ల సత్యం పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోం

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 3: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలో కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ ద్వారానే గెలిచాడని ఆరోపించారు. కేటీఆర్ పరువు నష్టం దావా వేస్తామనడం హాస్యస్పదంగా ఉందని మీరు ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిది పరువు కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడు తున్నారని. రాజకీయంగా ఎదుర్కొవాలే తప్పా అవాకులు చెవాకులు పేలవద్ద ని హెచ్చరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా తోట ఆగయ్య ఉండే నైతిక హక్కులేదని అన్నారు. మరోసారి కేకే మహేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షు లు వంగ మల్లేశంగౌడ్, అఫ్జాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు రఫీ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షు డు ఆకునూరి బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిన తప్పులతోనే నేడు కరువు

ముస్తాబాద్, ఏప్రిల్ 3 : గత ప్రభుత్వం పెద్దలు చేసిన తప్పుల ద్వారానే ప్రస్తుతం రాష్ట్రంలో కరువు ఏర్పడిందని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతోనే ప్రస్తుతం కరువు చోటు చేసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ఎస్సీ బీసీ సెల్ అధ్యక్షులు తలారి నర్సింలు, శీల ప్రశాంత్, తాళ్ల విజయ్‌రెడ్డి, ఎద్దండి మహేదర్‌రెడ్డి, ఏదునూరి భానుచందర్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

- జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు


పాత్తూర్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొమురయ్య అని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూర్‌లో బుధవారం కురుమసంఘ జిల్లా విద్యాకమిటీ అధ్యక్షుడు పోలె శ్రీని వాస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరగబడితేనే బానిస బతుకులు మారుతాయని ప్రజలకు వివరిం చిన కొమురయ్య, నిరంకుశ నిజాం ప్రభువులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడ న్నారు. కొమురయ్య ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. కార్య క్రమంలో నాయకులు ఈరు బీరయ్య, లింగయ్య, ఎల్లయ్య, నవీన్, శివ, నర్సయ్య, హన్మాండ్లు , కొమురయ్య, శ్రీను, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గొల్ల, కుర్మ యాదవ సం ఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య నేటి తరానికి ఆదర్శవంతుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, దేవేందర్, బాలు, రాములు, భూమయ్య, దేవయ్య, రాము, కృష్ణ, పర్శరాములు, సతీష్ త దితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు దుమ్మ అంజయ్య, చిలక పెంటయ్య, మ్యాక ల పరశురాములు బత్తుల కమలాకర్ , పరశురాములు సంఘం నాయకులు ఏనుగుల కృష్ణ, పరుశురాం, మేకల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 3: ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపల్లి మల్లేశం అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు మాట్లాడారు. ఎండలు పెరుగుతున్నందున ఉపాధి హామీ కూలీలకు తాగునీరు పంపిణీ చేయాల న్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకే పనులను కొనసాగించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. పనికి ముందు పని తర్వాత కూలీలను రెండు సార్లు ఫొటో అప్లోడ్ చేసే పద్ధతిని ప్రభుత్వాలు వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమి కొలతలు లేకుండా పనులు కల్పించాలని దినసరి వేతనాలు రూ. 600లు ఇచ్చి కూలీలను ఆర్థికంగా ఆదుకో వాలని అన్నారు. సమావేశంలో నాయకులు రాజు, రాజేం దర్, ఐలయ్య, మల్లన్న కొమరన్న, శంకర్ పాల్గొన్నారు.

మిడ్ మానేరు ప్రాజెక్ట్ ఎండిపోవడం కాంగ్రెస్ వైఫల్యమే

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్


మిడ్‌మానేరును పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు ప్రా జెక్ట్ ఎండిపోవడానికి ప్రభుత్వ అసమర్థత, వైఫల్యమే కారణమని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయి నపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద శాభాష్‌పల్లె మిడ్ మానేరు బ్రిడ్జిపై నుంచి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమతో క లిసి పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన పిల్లర్లకు రక్షణ చర్యలు చేపట్టినట్లయితే మిడ్ మానేరు ఎండిపో యేది కాదని వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్ర భుత్వం ఇప్పటికైనా కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

పబ్లిసిటీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి తాపత్రయం

- ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

వేములవాడ, ఏప్రిల్ 3: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవి చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల హామీలు నెరవేర్చడం కోసం పనిచే యకుండా కేవలం పబ్లిసిటీ కోసం మాత్రమే తాపత్రయ పడుతున్నాడని భారతీ య జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ విమర్శించారు. బుధవారం నాడు వేములవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆచరణ సాధ్యం కాని అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింద ని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 100 రోజులు గడిచినప్పటికీ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, కేవలం ప్రజలను మభ్య పెట్టడానికి పబ్లిసిటీ మాత్రమే చేస్తున్నారని అన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, మహిళలకు గృహజ్యో తి కింద నెలకు 2500 రూపాయలు ఇంతవరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వడగళ్లతో రైతులు నష్టపోగా ప్రభుత్వం ఎక్కడ పరిహారం అందించి న దాఖలాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రేమతో ప్రజలు ఓట్లు వేయలేదని, బీఆర్ఎస్ మీద ఉన్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని గుర్తుంచుకోవాలని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే నిర్బంధం అమలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే గతప్రభుత్వానికి పట్టినగతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ రైతులను, ప్రజలను మభ్య పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని అన్నారు. అధికారంలో ఉన్న 10 సంవత్సరాల కాలంలో కెసిఆర్‌కు రైతులు గుర్తుకు రాలేదని, పదేళ్ల తర్వాత ఇప్పుడు రైతులు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉన్న రోజున కేసీఆర్ ఒక్కనాడు బయటకు వచ్చి రైతులను పరామర్శించ లేదని అన్నారు. రైతుల పక్షాన, ఉద్యోగుల పక్షాన మొదటి నుండి పోరాటం చేసింది బీజేపీ పార్టీయే అన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని రైతుల కోసం ఈ నెల ఐదున దీక్ష చేపడుతున్నాం అని చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ పార్టీ అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణస్వామి, సంటి మహేశ్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 3: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందని జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, సిద్దిపేట జిల్లా, సిరిసిల్ల జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు విమర్శిం చారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని రంగనాయక సాగర్ నుంచి జిల్లెల్లకు వచ్చే కాలువలను పరిశీలించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బంధు లేదు.. రైతు రుణమాఫీలేదు.. కనీసం 20 గుంటలకు నష్ట పరిహారం చెల్లించలేని చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. బీఆర్ఎస్ హయాంలో వేసవిలో సైతం కాలువల ద్వారా చెరువులలో నీటిని నింపిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు హరీ‌ష్‌రావు, కేటీఆర్‌పై కాలువలు నిర్మించలేదని తప్పుడు ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. హరిశ్ రావు, కేటీఆర్ సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల అధికారులతో మాట్లాడి కాలువల నిర్మాణం పూర్తి చేశరన్నారు. 60 ఎకరాల పట్టా భూమి కాలువ నిర్మాణాల్లో పోతే అందులో 57 ఎకారలకు నష్ట పరిహారం చెల్లించామన్నారు. రైతులపై మొసలికన్నీరు కారుస్తుండడాన్ని తప్పుపట్టారు. రైతులతో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. పార్టీలు మారడం గూర్చి మాట్లడుతున్న కాంగ్రెస్ నాయకులు కెకె మహేందర్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారడో తెలుసుకుని మాట్లడాలని హితవు పలికారు. బ్లాక్ మెయిల్, బెదిరింపు రాజకీయా లు మానుకోవాలన్నారు. వ్యక్తిగత దూషణలు మానుకోవాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎండకాలంలో పంటలు ఎండకుండా సాగునీరందించామని, రైతు బంధు ఇచ్చి ఆదుకున్నామని అన్నారు. సమావేశంలో ఎంపీపీ బాలమల్లు, జెడ్పీటీసీ కుంబాల ఎల్లారెడ్డి, రెండు జిల్లాల బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పర్శరాములు, భాను, హరీష్, రాజు, బాల్‌రెడ్డి, పద్మ, దేవయ్య, నర్ర సతీష్‌రెడ్డి, పుసపెల్లి రాంచంద్రం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఇళ్లలో పోలీసుల సోదాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సినిమా థియోటర్ సమీపంలోని పలు ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగు తున్నాయనే సమాచారం మేరకు ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ప్రముఖుల ఇళ్లను క్షుణ్ణంగా పరిశీ లించారు. ఇంట్లో ఎవరెవరు నివసిస్తున్నారనే వివరాలను సేకరించారు. పోలీ సులు ఒక్కసారిగా ఇళ్లలో తనిఖీలు చేయడం స్థానికంగా కలకలం సృష్టిం చింది. ఎన్నికల నేపథ్యంలో సోదాలు చేశారా..? లేక ప్రముఖుల ఇళ్లలో గుట్టుగా సాగిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై తనిఖీలు నిర్వహించారా..? అనే చర్చ స్థానికంగా కొనసాగుతోంది.

సినిమా థియోటర్ సమీపంలోని కాలనీలో కొందరు కొంత కాలంగా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారంతో సోదాలు నిర్వహించామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, ఏప్రిల్ 3: చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఈ నెల 1న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న గోగుల రాజు, అఖిల్‌ను ఢీ కొట్టి గాయాలు కావడానికి కారణమైన మర్రి రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడవులను నరికితే చర్యలు

వీర్నపల్లి, ఏప్రిల్ 3: అడవులను నరికితే చర్యలు తీసు కుంటామని ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మం డలం గర్జనపల్లి సెక్షన్ పరిధిలోని లాల్ సింగ్ తండాలో చెట్లను ధ్వంసం చేసిన మాలోతు ప్రకాష్, భూక్య మదన్ అనే ఇద్దరిని వీర్నపల్లి తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేశారు. అడవులను నరికితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

చందుర్తి, ఏప్రిల్ 3: గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. మండలంలోని దేవుని తండాలో బెల్ట్‌షాపుపై బుధవారం రాత్రి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఆరు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబు ల్ సతీష్ పాల్గొన్నారు.

మడేలయ్య స్వామి జాతరలో పాల్గొన్న విప్

కోనరావుపేట, ఏప్రిల్ 3: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని శ్రీమడేలయ్య స్వామి జాతర మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా బాగుండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు సదానందం, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

- డీఆర్‌డీవో శేషాద్రి - పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


బండలింగంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి


వట్టిమల్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం రాకేష్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్ధతు ధరను పొందాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, పదిర, బండలింగంపల్లి, బొప్పాపూర్, కిష్టునాయక్‌తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో శే షాద్రి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని అన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం పాపారావు, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు, బుక్ కిపర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళ సంఘాల ప్ర తినిధులు, రైతులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో చిలుక గౌరిశంకర్ బుధవారం ప్రారంభించారు. పెద్దూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో స్థానిక మైసమ్మ చెరువు శిఖంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల పోసి ధాన్యాన్ని తూకం వేసి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారం నారాయణగౌడ్, డైరెక్టర్‌లు ఎరవెల్లి వెంకటరమణారావు, భూక్యకిషన్‌నాయక్, మంగ కిరణ్, మాజీ చైర్మన్ ఉలిసే తిరుపతి, మాజీ సర్పంచ్ రాకం రమేష్, అదిపెల్లి నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు నర్మాల గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండల కేంద్రంలో, నర్మాలలో ఐకేపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఐకేపి సీసీలు పద్మ, పంచాయితీ సెక్రటరీ రమేష్, లావణ్య, గ్రామైక్య సంఘం అధ్యక్షులు వినీల, వెంకటలక్ష్మి, రైతులు ఉన్నారు.

కోనరావుపేట: ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రాకేష్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, నిమ్మపల్లి, మరిమడ్ల, వట్టిమల్ల గొల్లపల్లి, వట్టిమల్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో సీసీలు శోభరాణి, రేణుక, బాలరాజు, రవి, జనార్దన్, వ్యవసాయ అధికారి వెంకటరామవ్వ, ఏఈవో సహజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.